క్లుప్తంగా

ఐఏఎల్ నూతన కమిటీ ఎన్నిక



రేపల్లె రూరల్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లా (ఐఏఎల్) రేపల్లె నూతన కమిటీ ఎన్నికలు మంగళవారం రేపల్లె తాలూకా కార్యాలయ ప్రాంగణంలో జరిగాయి. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్‌డీఎం రబ్బాని, ప్రధాన కార్యదర్శిగా పి.నాగాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా గురివిందపల్లి రామారావు, కార్యదర్శిగా మోర్ల కృష్ణారావు, సహాయ కార్యదర్శిగా కర్రా ప్రతాప్, గౌరవాధ్యక్షుడిగా పి.భూషణంతో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, న్యాయవాది దారం సాంబశివరావు తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం



భట్టిప్రోలు: బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశానుసారం మంగళవారం భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలోని కార్యాలయ సమావేశపు హాలులో మండల స్పెషల్ ఆఫీసర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పింఛన్ల పంపిణీ, ఐవీఆర్‌ఎస్ సమాచారం, హౌస్ హోల్డ్ ట్యాగింగ్ సర్వే, మిస్సింగ్ సిటిజన్ అండ్ ఎంప్లాయిస్, పీఏసీఎస్ సర్వేలు పీఆర్ 1 ఇతర ప్రాధాన్యతా అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ వెంకటరమణ, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



అమర్తలూరు(వేమూరు): విద్యార్థులు పట్టుదల, ఆత్మ విశ్వాసం, క్రమ శిక్షణతో చదువుకోవాలని మోటివేషన్ స్పీకర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. అమర్తలూరు మండలంలోని గోవాడ పావులూరు వెంకయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మానవతా సంస్థ స్టూడెంట్స్, టీచర్స్, పేరెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మహోన్నతులైన అబ్దుల్ కలాం, అంబేడ్కర్ వంటి వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శివ శంకర్, స్టెప్ సంస్థ బాధ్యులు కాట్రగడ్డ శివరామకృష్ణ, ప్రసాద్, ఉప్పల సాంబశివరావు విద్యా కమిటీ చైర్మన్ కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లాస్ వలంటీర్లకు పుస్తకాలు పంపిణీ



భట్టిప్రోలు: నిరక్షరాస్యులకు కనీస విద్య, డిజిటల్ లిట్రసీ, ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించేందుకు మండల పరిధిలోని యానిమేటర్లు, ఉల్లాస్ వలంటీర్లకు గత నెల నవంబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ ఇస్తున్నాయి. మంగళవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మండల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉల్లాస్ వలంటీర్లకు అభ్యాసకుల హాజరు పట్టిక పుస్తకం, అక్షర వెలుగు సంక్షిప్త వాచకం, అక్షర వెలుగు సంక్షిప్త వాచకం మార్గదర్శిని పుస్తకాలను ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంఈవో నీలం దేవరాజు, వెల్లటూరు డీసీ చైర్మన్ యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ కనపర్తి సుందరరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, సీసీలు పి.నరేంద్ర, డి.హనోక్, కె.రజనీ కుమారి పాల్గొన్నారు.

10న వైకుంఠ ఏకాదశి

వేమవరం(భట్టిప్రోలు): సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరం గ్రామంలో కొలువైన శ్రీ రుక్మాబాయి సహిత పాండురంగస్వామి దేవస్థానంలో ఈ నెల 10వ తేదీన ధనుర్మాస వైకుంఠ ఏకాదశి నిర్వహించనున్నట్లు దేవాలయ ధర్మకర్తల మండలి నిర్వాహకులు మంగళవారం తెలిపారు. అలాగే మండల కేంద్రమైన భట్టిప్రోలులోని రథం సెంటర్‌లో కొలువైన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో వైకుంఠ ద్వార దర్శనం ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు దేవాలయ స్పెసిఫిక్ ఎండోమెంట్ వంశపారంపర్య ఫౌండర్ ట్రస్టీలు మానేపల్లి రఘునాథబాబు, పార్వతీ శంకరసాయిలు మంగళవారం తెలియజేశారు.

జొన్న, మొక్కజొన్న సాగుకు రైతుల ఆసక్తి

- మొక్కజొన్నలో దిగుబడులు అధికం
- ప్రభుత్వం కొనుగోలు చేస్తుండడంతో జొన్న సాగుకు మొగ్గు



జంపని గ్రామంలో మొక్కజొన్న పంట

వేమూరు: రబీ సీజనలో మినుము, పెసర పంటలకు పల్లాకు తెగులు వ్యాపిస్తుండడంతో రైతులు జొన్న, మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మొక్కజొన్న పంట అధిక దిగుబడి రావడంతో రైతులు ఎక్కువ శాతం మొక్కజొన్న సాగు చేస్తున్నారు. జొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేయడంతో రైతులు జొన్న పంట సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో 95 వేల ఎకరాలలో సాగు చేశారు. మొక్కజొన్న పంట 30,000 ఎకరాల్లో సాగు చేయగా, జొన్న 20,000 ఎకరాల్లో సాగు చేశారు. 45 వేల ఎకరాల్లో మినుము, పెసర పంటలు సాగు చేశారు. + మొక్కజొన్న పంటకు సాగునీరు, బోరు నీరు పుష్కలంగా అందడం, అలాగే అధిక దిగుబడి రావడంతో రైతులు మొక్కజొన్న సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

- జొన్న పంటలో అధిక దిగుబడులు సాధించడంతో రైతులు జొన్న పంట వైపు మొగ్గు చూపుతున్నారు.
- జొన్న, మొక్కజొన్న పంటలకు సాగు నీరు సకాలంలో అందని ప్రాంతాల్లో రైతులు మినుము, పెసర సాగు చేస్తున్నారు.
- చుండూరు మండలంలో మొక్కజొన్న పంట 6,000 వేల ఎకరాలలో సాగు చేయగా, అమర్తలూరులో 7,000 వేల ఎకరాలు, వేమూరులో 7,000 వేల ఎకరాలు, కొల్లూరు 6 వేలు, భట్టిప్రోలు 4 వేల ఎకరాల్లో సాగు చేశారు.
- వేమూరులో జొన్న 8,000 వేల ఎకరాల్లో సాగు చేయగా, చుండూరు మండలంలో 3,000 వేల ఎకరాలు, కొల్లూరు 2,000 వేలు, అమర్తలూరు 5 వేల ఎకరాల్లో, భట్టిప్రోలు 2 వేల ఎకరాల్లో సాగు చేశారు.
- గత ప్రభుత్వంలో జొన్న పంట ప్రభుత్వం కొనుగోలు చేయడంతో ఈ ఏడాది రైతులు జొన్న పంట సాగు చేశారు. మొక్కజొన్న పంటకు బస్తా రూ.2 వేలకు కొనుగోలు చేయడంతో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. మొత్తంమీద సాగు నీరు పుష్కలంగా అందే ప్రాంతాల్లో మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

మొక్కజొన్న పంటతో లాభం ఎక్కువ



మొక్కజొన్న పంట సాగు చేయడంతో ఎక్కువ దిగుబడి వస్తోంది. మొక్కజొన్న అధికంగా రేటు ఉండటం వల్ల లాభాలు వస్తున్నాయి. అందువల్ల 10 ఎకరాలలో మొక్కజొన్న సాగు చేస్తున్నాను. ప్రతి ఏడాది మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాను.

– రాయపూడి బుజ్జిబాబు, రైతు, బలిజేపల్లి

జొన్న పంట సాగు చేస్తున్నాను



జొన్న పంటకు రెండు సార్లు నీరు అందించడంతో దిగుబడి అధికంగా వస్తోంది. జొన్న పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు చేస్తోంది. అందువల్ల జొన్న పంట సాగు చేస్తున్నాను.

–ఈపూరు యోహాను, రైతు, వరహాపురం

డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు చేపట్టరాదు

కమిషనర్ జి.రఘునాథరెడ్డి



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

బాపట్ల: జిల్లా కేంద్రమైన బాపట్ల మున్సిపాల్టీలో డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు ఉంటే సహించేదిలేదని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి హెచ్చరించారు. సూర్యలంక రోడ్డులోని డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలను మంగళవారం తొలగించారు. ఆక్రమణల వలన ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని చెప్పారు. ఫుట్‌పాత్‌లను ప్రజలు నడిచేందుకే ఉపయోగించాలని సూచించారు. పలు రోడ్లలో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకుని మున్సిపల్ అధికారులకు సహకరించాలని సూచించారు.

ఎస్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు

బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి

భట్టిప్రోలు: సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్‌ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో జనవరిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ మంగళవారం తెలిపారు. ఈ నెల 12న వివేకానంద జయంతి, 13న పుష్య పౌర్ణమి సందర్భంగా సామూహిక హారతులు, 13 నుంచి 15 వరకు సంక్రాంతి సంబరాలు, మేలు కొలుపుల నిర్వహణ, 26న భారతమాత పూజా కార్యక్రమం, గణతంత్ర వేడుకలు, సంక్రాంతి నుంచి 26వ తేదీ వరకు గ్రామ ధార్మిక సమితి సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తేదీన వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ఉత్తర ద్వారదర్శనం ఏర్పాటుకు కార్యకర్తలు తోడ్పాటు అందించే విధంగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, జిల్లా పరియోజన ప్రముఖ్ పడమటి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ బూర్లె అరుణ కుమారి, కె.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన అంజనీ ప్రసాదరెడ్డి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన కల్లి అంజనీప్రసాదరెడ్డి మంగళవారం తాడేపల్లి కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆప్యాయంగా పలకరించిన జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. ఆ తర్వాత ప్రసాదరెడ్డి పార్టీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, బాపట్ల జిల్లా కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిలను వేర్వేరుగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయనని, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

మినుములో సస్యరక్షణ చేపట్టాలి



బెల్లంవారిపాలెంలో రైతులకు సూచనలిస్తున్న ఏవో రమేష్‌బాబు

నగరం: రబీలో మినుము సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి వి.రమేష్‌బాబు చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బెల్లంవారిపాలెం, బొరమాదిగపల్లి గ్రామాలలో వ్యవసాయాధికారులు పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మాగాణిలో మినుము సాగు చేసిన రైతులు కలుపు నివారణపై దృష్టి సారించాలన్నారు. మినుము వేసిన 20–25 రోజుల వ్యవధిలో ఊద, గరిక, చిప్పెర గడ్డి జాతి మొక్కల నివారణకు ఎకరాకు ఫైనాక్సాప్రాఫ్ ఇథైల్ 250 మి.లీ లేదా క్విజోలో పాస్ ఇథైల్ 400 మి.లీ మందును తగిన నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నాగశ్రీనివాసరావు పాల్గొన్నారు.



కూచిపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగును నివారించాలి

అమర్తలూరు(వేమూరు): మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు కనిపిస్తోందని మండల వ్యవసాయాధికారి ఉయ్యూరి లోకేశ్వరి అన్నారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి, యడవూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని జొన్న, మొక్కజొన్న పంట 20 రోజుల దశలో ఉందన్నారు. మొక్కజొన్న పంటకు కాండం తొలుచు పురుగు కనిపిస్తోందని దీని నివారణకు ఎకరాకు 6–8 కిలోల కార్బొఫ్యూరాన్ 3జీ గుళికలు మొక్క మువ్వలో వేయాలని సూచించారు. థయోమిథాక్సిమ్ లేదా ల్యాండా సైహాల్‌త్రిన్ కలిపిన మందును లేదా కొరాజిన్ ఎకరానికి 60 మి.లీ. పిచికారీ చేయాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఇ.శ్రీకాంత్, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.తిరుపతి రావు, ప్రవల్లిక, రైతులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖాధికారి

పంట నమోదుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి

కొల్లూరు : రబీలో సాగు చేసిన పంట నమోదు విషయంలో రైతులు నిర్లక్ష్యం వహించకుండా వంద శాతం ఈ క్రాప్ బుకింగ్‌తో పాటు, ఈ కేవైసీ చేయించుకోవడం ముఖ్యమని మండల వ్యవసాయ శాఖాధికారి ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఈపూరు, కొల్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని జొన్న, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు అందజేశారు. జొన్న, మొక్కజొన్న పంటలను కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసే అవకాశాలున్న నేపథ్యంలో పంట నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రస్తుతం డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు రైతులకు తగిన మోతాదులో అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, రైతులు భవిష్యత్ అవసరాల కోసం అధిక మొత్తంలో ఎరువులు కొనుగోలు చేయకుండా అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవ సాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



యలవర్రు రెవెన్యూ సదస్సులు తహసీల్దారు నెహ్రూ

రెవెన్యూ సదస్సులో 9 అర్జీలు

అమర్తలూరు(వేమూరు): రైతులు, గ్రామ ప్రజల సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని తహసీల్దారు నెహ్రూ తెలిపారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామంలో రెవెన్యూ సదస్సు మంగళవారం నిర్వహించారు. గ్రామస్తులు 9 అర్జీలు అందజేశారు. వాటిని పరిశీలించి త్వరగా పరిష్కారం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శివయ్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

కొల్లూరు : భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల్లో ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని దోనేపూడి, బొద్దులూరుపాడు గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్న ఆయన రెవెన్యూ సంబంధిత సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై విచారణ నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. దోనేపూడిలో 4, బొద్దులూరుపాడులో 2 అర్జీలు అందినట్లు తెలిపారు.



దోనేపూడి రెవెన్యూ సదస్సులో ప్రసంగిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు



పోతుమర్రు రెవెన్యూ సదస్సులో తహసీల్దారు సుశీల

మండలంలో ముగిసిన రెవెన్యూ సదస్సులు

పోతుమర్రు(వేమూరు): రైతుల సమస్యలు పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని తహసీల్దారు సుశీల అన్నారు. వేమూరు మండలంలోని పోతుమర్రు గ్రామంలో రెవెన్యూ సదస్సు మంగళవారం నిర్వహించగా రెండు అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. మొత్తం 190 అర్జీలు అందగా వాటిలో 106 అర్జీలు పరిష్కారం చేయడం జరిగిందన్నారు. 84 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలించి పరిష్కారం చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు మండలంలో...

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం ఆళ్లమూడి, కోనేటిపురం పంచాయతీ కార్యాలయాల ఆవరణలో మంగళవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. గత నెల 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సదస్సులు ముగిశాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సదస్సులలో 19 అర్జీలు అందినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆళ్లమూడి, కోనేటిపురం సర్పంచులు పెద్దిశెట్టి రాంబాబు, మోర్ల వెంకటేశ్వరమ్మ, ఉప సర్పంచ్ రాజులపాటి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు ప్రదీప్, ఎ.చిన వెంకటేష్‌బాబు, దేవదాయ శాఖ మండల ఇన్‌చార్జ్ దీవి వెంకటప్లాచార్యులు, ఆర్‌ఐ ఫణికుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, వీఆర్వోలు అబ్దుల్ కరీమ్ బేగ్, శివరామకృష్ణ, కాళీకృష్ణ, ప్రసాద్, పుల్లయ్య, జక్రయ్య వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆళ్లమూడి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

రేపల్లె రూరల్: భూ సమస్యలను ప్రజలు రెవెన్యూ సదస్సులలో పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని కారుమూరు, అరవపల్లి గ్రామాలలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అనంతరం మాట్లాడారు. భూ సంబంధిత ఫిర్యాదులపై విచారించి సమస్యను 45 రోజులలో పరిష్కరించేందుకు కృషి చేయబడునన్నారు. 21 అర్జీలు అందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాంబాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాయిబాబా జయంతి వార్షికోత్సవాలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లోని షిర్డీ సాయి బాబా ఆలయంలో నిర్వహిస్తున్న 80వ జయంతి వార్షికోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా సాయిబాబాకు సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో పాలకుర్తి రామకృష్ణ, నిర్మల, ఆత్మూరి వాలేశ్వరరావు, భవానీ దంపతులు పాల్గొన్నారు. సాయిబాబా జీవిత చరిత్రలోని అంశాలు, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణేశ్వరస్వామి వార్లకు సంబంధించిన ప్రవచనాలు, స్తోత్రాలు, స్తుతులు, గేయాలను బాలా త్రిపుర సుందరి మహిళా సమాజం వారు ఆలపించారు. మధ్యాహ్నం జరిగిన నారాయణ సేవలో కులమతాలకు అతీతంగా 1000 మంది విచ్చేసి బాబా వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ నెల 10న ఆలయంలో వైకుంఠ ఏకాదశి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివరావు, కోశాధికారి బూర్లె కిరణ్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

సదరం క్యాంపు నిలిపివేత

వేమూరు: దివ్యాంగులకు నిర్వహించే సదరం మెడికల్ క్యాంపును నిలిపి వేశారు. వేమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం సదరం క్యాంపు నిర్వహించడం జరుగుతుంది. దీనిపై సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ జర్నినాఫరీవీన్‌ను వివరణ కోరగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 7 నెలల తర్వాత దివ్యాంగుల పింఛన్ల అర్హులను గుర్తించేందుకు విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు. విచారణ పూర్తయిన తర్వాత ప్రభుత్వం సదరం క్యాంపు నిర్వహించేందుకు ప్రకటన చేస్తుందని అన్నారు. కాగా గత ప్రభుత్వంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో దివ్యాంగులకు ప్రతి మంగళవారం సదరం క్యాంపు నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు.

12న ముగ్గుల పోటీలు

రేపల్లె రూరల్: పట్టణంలోని స్వయంభూరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 12వతేది ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మట్టుపల్లి సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించబడునని, ఆసక్తి కలిగిన మహిళలు పోటీలలో పాల్గొనాలని కోరారు. ముగ్గులు వేసేందుకు అవసరమైన వస్తువులు ఎవరికి వారు సమకూర్చుకోవాలని చెప్పారు. వివరాలకు 83281 24295 నంబరును సంప్రదించాలన్నారు.

నేటి నుంచి మొదటి విడత గ్రామ సభలు

భట్టిప్రోలు: పంచాయతీ రాజ్ కమీషనర్ ఆదేశానుసారం భట్టిప్రోలులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (జీపీడీపీ) 2025–26 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మొదటి విడత గ్రామ సభలు జరుగుతాయని ఎంపీడీవో ఎస్ వెంకట రమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం గొరిగపూడి, ఓలేరు, కన్నెగంటివారిపాలెం, పెదపులివర్రు, రాచూరు, ఆళ్లమూడి, కోనేటిపురం, గురువారం సూరేపల్లి, ఐలవరం, భట్టిప్రోలు, చింతమోటు, పెదలంక, శుక్రవారం పెసర్లంక, వెల్లటూరు, పల్లెకోన గ్రామాలలో ఈ సభలు జరుగుతాయని పేర్కొన్నారు.

దస్తావేజులు పోయినవి

కాగిత సత్యసందీప్ S/o కాగిత ఏసోబు, కర్లపాలెం మండలం, పేరలిపాడు వాస్తవ్యులకు చెందిన ఆనే గ్రామం కాలాపు ఓ.నెం.218/2 మై లో య.0-04 సెంట్లు స్థలము అందులో కొంత భాగంలో నిర్మించిన ఆర్.సి.సి డాబా కలదు. సదరు ఆస్తికి సంబంధించిన నెం. 3973/2013, 1253/2022, 10677/2022 ల గల దావ్యుమెంట్లు, లింకు డాక్యుమెంట్లు తీసుకొని జిరాక్స్ కోసం పేరలిపాడు గ్రామము నుండి కర్లపాలెం ది.30-11-2024న వస్తుండగా మార్గమధ్యలో పోయినవి. ఎంత వెతికినను దొరకలేదు. దొరికినవారు సంప్రదించవలెను: ఫో 7093309261

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

రేపల్లె రూరల్: ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలను అందించనుందని ఎంపీడీవో ఎం.శోభారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలతో పాటు ఈడబ్ల్యూఎస్ వర్గానికి చెందిన ఈబీసీ, రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణులకు కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించబడునన్నారు. ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సంబంధిత పోర్టల్ ద్వారా పూర్తి వివరాలను నమోదు చేయాలని చెప్పారు. 21–60 వయస్సు కలిగిన అభ్యర్థులు ఆధార్, రైస్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

భట్టిప్రోలు: స్వయం ఉపాధి కల్పనలో భాగంగా బీసీ సామాజిక వర్గాలు రాయితీ రుణాల కోసం ఈ నెల 8 నుంచి 16వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్ వెంకటరమణ తెలిపారు. మండలంలో బీసీ–ఏలకు 4 యూనిట్లకు రూ.8 లక్షలు, బీసీ–బీలకు 18 యూనిట్లకు రూ.34 లక్షలు, బీసీ–డీలకు 4 యూనిట్లకు రూ.7 లక్షలు, ఈబీసీలకు 5 యూనిట్లకు రూ.15.50 లక్షలు రాయితీ రుణాలు అందించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాయితీ రుణాల నమోదుకు 16 వరకు గడువు

కొల్లూరు : బీసీ, ఈడబ్ల్యూఎస్ బాంకు లింక్ రాయితీ రుణాలు పొందేందుకు అర్హులైన వ్యక్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ఈ నెల 16 వరకు గడువు ఉన్నట్లు ఎంపీడీఓ కె.నరసింహారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని బీసీ, ఈడబ్ల్యూఎస్ కులాలకు చెందిన లబ్ధిదారులు ఈ నెల 8 నుంచి 16 లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

పెన్షన్‌లు సకాలంలో పంపిణీ చేయాలి

మండల ప్రత్యేక అధికారి కృష్ణ కిషోర్

నిజాంపట్నం: లబ్ధిదారులకు పెన్షన్‌లు సకాలంలో సక్రమంగా పంపిణీ చేయాలని మండల ప్రత్యేక అధికారి బి.కృష్ణకిషోర్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలో పెన్షన్‌లు పంపిణీ చేసే అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్‌ల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. పింఛన్‌ల పంపిణీలో సాంకేతిక సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి, ఈవోపీఆర్డీ ఎం.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



కర్లపాలెం: అక్రమంగా మద్యం విక్రయించే వారిపై చట్ట ప్రకారం కేసులు పెడతామని కర్లపాలెం ఇన్‌చార్జ్ ఎస్ఐ ఆర్ స్వామి శ్రీనివాస్ తెలిపారు. బుద్ధాం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారనే సమాచారంతో మంగళవారం తనిఖీలు నిర్వహించి నర్రా శివనాగరాజు వద్ద 10 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. శివనాగరాజును కోర్టుకు హాజరుపరుస్తామని ఆయన అన్నారు. బహిరంగంగా మద్యం తాగినా, మద్యం తాగి వాహనాలు నడిపినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.